క్లుప్తంగా

చిగురిస్తున్న వేప చెట్లు



బీబీపేట: వైరస్ కారణంగా పూర్తిగా ఎండిపోయిన వేప చెట్లు తిరిగి చిగురిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆయుర్వేద మందులాగా వినియోగించే వేప ఆకులు వైరస్ కారణంగా ఎక్కడ చూసినా ఎండిపోయి కన్పిస్తున్న విషయం తెలిసిందే. వేప చెట్లు చిగురిస్తుండటంతో గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన టోర్నమెంట్



నాగిరెడ్డిపేట: మండల కేంద్రంలోని గోపాల్‌పేటలో మూడు రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. టోర్నమెంట్‌లో 13 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్‌లో మొదటి స్థానంలో నిలిచిన నాగిరెడ్డిపేట ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల జట్టుకు రూ. 15 వేలు, ద్వితీయ స్థానం దక్కించుకున్న చీనూర్ జట్టుకు రూ. 10 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు వినీల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ



సదాశివనగర్: మండలంలోని పద్మాజివాడి, కల్వరాల్ గ్రామాల మధ్య మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా వెళ్తోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వెల్లడించారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసమే యోగా



కామారెడ్డి అర్బన్: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు అంతర్ముఖ యోగా శిక్షణ పొందాలని శ్రీసత్యసాయి ధ్యానమండలి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు భిక్షమయ్య గురూజీ అన్నారు. స్థానిక పార్శి రాములు కల్యాణమండపంలో రెండు రోజుల పాటు నిర్వహించిన యోగా శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా భిక్షమయ్య గురూజీ మాట్లాడుతూ 25 ఏళ్లుగా యోగాలో ఎన్నో పరిశోధనలు చేసి అందులో అంతర్ముఖ యోగాతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పరమేశ్వర్, న్యాయవాది బి.నాగభూషణం, రిటైర్డ్ ఎస్సై సాయిలుయాదవ్ పాల్గొన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు

బాన్సువాడ: సామాజిక ఆశయ సాధన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్‌లో శిక్షణ పొందిన మహిళలకు జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు. సామాజిక ఆశయ సాధన వ్యవస్థాపకులు సందల గంగారం మాట్లాడుతూ ప్రతి ఏటా నిరుద్యోగ యువతులకు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు సతీష్, రవి, రాహుల్, మహేష్, నాయకులు గోపాల్ రెడ్డి, పాతబాలకృష్ణ, మైశయ్య, గంగారం, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

పలుచోట్ల బలగం ప్రదర్శన



బీబీపేట: మండల కేంద్రంలోని బురుజు వద్ద ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుతారి రమేష్ అధ్వర్యంలో బలగం సినిమాను ప్రదర్శించారు.
దోమకొండ: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించినట్లు నిర్వాహకులు వినాయక సిండికేట్ అధ్యక్షుడు కుకుట్ల అనిల్ తెలిపారు.
సదాశివనగర్: మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి, ధర్మారావ్‌పేట్‌లో సినిమాను ప్రదర్శించినట్లు సర్పంచ్‌లు పైడి జానకి జనార్దన్, బదాల భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.
లింగంపేట: మండలంలోని శెట్పల్లి, పొల్కంపేట గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు స్క్రీన్లను ఏర్పాటు చేసి సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచులు పద్మ, గంగారెడ్డి, మణిగిరి పద్మ, నాగరాజు పాల్గొన్నారు.

కేసీఆర్ సేవలు దేశానికి అవసరం

- కేసీఆర్ దేశ రాజకీయాల్లో చక్రం తిప్పే సమయం ఆసన్నమైంది
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే

నిజాంసాగర్(జుక్కల్): సీఎం కేసీఆర్ దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాల్సిన సమయం ఆసన్నమైందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఆయన సేవలను దేశంలోని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఆదివారం జుక్కల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుతో పాటు రైతులు, మహిళా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ప్రజలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను కావాలని అక్కడి పాలకులను నిలదీస్తున్నారని పేర్కొన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణ లక్ష్మి, రైతుబంధు, రైతు బీమా పథకాలు దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ పథకాలు అమలు చేయాలంటే కేసీఆర్ దేశ రాజకీయాల్లో అవసరం అన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీలను అభ్యున్నతి చేయడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ యశోధ, నాయకులు దాదారావ్, సాయాగౌడ్, శివానంద్‌పటేల్, బాసుగౌడ్, పాకలి. శ్రీనివాస్, రాములుసేట్, రవీపటేల్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ధాన్యం కల్లాల వద్ద కాంగ్రెస్ నేతలు

నస్రుల్లాబాద్: వరి కోతలు ప్రారంభమైనందున ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కాసుల బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆ పార్టీ నేతలతో కలిసి బీర్కూర్ మండలంలోని చించెల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సొసైటీల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయక పోవడంతో దళారులని నమ్మి రైతులు మోసపోతున్నారని పేర్కొన్నారు. దీంతో మద్దతు ధర దక్కక ఎకరానికి రూ.10 వేల వరకు నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు బి.శంకర్, గణేష్, పీరయ్య, సాయిలు, గంగారాం, జమీర్, రాంబాబు, సుభాష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఈస్టర్

- పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శిలువ వద్ద జ్యోతుల వెలిగింపు



ఎల్లారెడ్డి సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు



నిజాంసాగర్ మండలం మహమ్మద్‌నగర్‌లో..



నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్ పల్లిలో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల క్రైస్తవులు ఆదివారం ఈస్టర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ఏసుక్రీస్తు శిలువ వద్ద జ్యోతులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగానే నిజాంసాగర్ మండల కేంద్రంతో పాటు మాగి, ఒడ్డేపల్లి, మల్లూర్, ఆరేడ్, అచ్చంపేట, మహమ్మద్ నగర్, కొమలంచ, గాలీపూర్ గ్రామాల్లో ఈస్టర్ పండుగ నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సీఎస్ఐ చర్చి, నస్రుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి చర్చి, దోమకొండ మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో ప్రార్థనలు చేసి కరుణామయుడిని స్తుతించారు.



దోమకొండ మండలం సంఘమేశ్వర్‌లో..

పోలీసు కవాతు



మద్నూర్‌లో కవాతు చేస్తున్న పోలీసులు



బిచ్కుందలో..

బిచ్కుంద/మద్నూర్: మండల కేంద్రమైన బిచ్కుంద, మద్నూర్‌లలో ఆదివారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది కవాతు నిర్వహించారు. వివిధ వర్గాల మధ్య ఎలాంటి అల్లర్లు జరగకుండా నివారించేందుకే కవాతు నిర్వహిస్తున్నట్లు బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరు పరస్పరం గౌరవించుకుంటూ సోదర భావంతో పండుగలు, ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



భిక్కనూరు: మండల కేంద్రంలోని మజీద్‌లో ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. అన్ని మతాలకు చెందిన వారు ఒకరినొకరు గౌరవించుకోవాలని ఆయన సూచించారు.

దాబాల్లో మద్యం విక్రయిస్తే కేసులు

ఎల్లారెడ్డి: దాబాల్లో మద్యం సేవించినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై గణేష్ హెచ్చరించారు. మద్యం సేవించిన వారితో పాటు దాబా యజమానులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ



నిజాంసాగర్: మండలంలోని దూప్‌సింగ్ తండా పంచాయతీలో స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు ఆదివారం సర్పంచ్ చెందర్ రాథోడ్ పావలా వడ్డీ మాఫీకి చెందిన చెక్కులను అందజేశారు. 14 సంఘాలకు రూ. 3.11 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు శాంత, వీవోఏ సరిచంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ



ఎల్లారెడ్డిరూరల్: కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్డులను ఆ పార్టీ నాయకుడు అంజయ్య తదితరులు ఆదివారం మండలంలోని మల్లయపల్లి, రేపల్లెవాడ గ్రామాల్లో పంపిణీ చేశారు. పార్టీ సభ్యత్వం ఉన్న వారు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తున్న విషయం తెలిసిందే.

ఆధ్యాత్మికం

■ **ఘనంగా బోనాల పండుగ**



ఎల్లారెడ్డిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో మహిళలు ఆదివారం బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మకు బోనాలు సమర్పించారు.

■ **ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత**



భిక్కనూరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత సాధించవచ్చని బీజేపీ నియోజకవర్గం ఇంచార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం తిప్పాపూర్ హనుమాన్ దేవాలయ కమిటీ ప్రతినిధులు సతీషు,రవి, రమేషు, సర్పంచ్ కొక స్వామి ఆయన్ను సన్మానించారు.

■ **సిద్ధరామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు**



భిక్కనూరు: శ్రీసిద్ధరామేశ్వర ఆలయంలో రోటరీ క్లబ్ గవర్నర్ తాల్ల రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి ఆయన్ను సన్మానించారు.

■ **వైభవంగా కుంకమార్చన**



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని గోర్గల్ గ్రామంలో కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయ నిర్మాణార్థం అమ్మవారి కుంకుమార్చనలు చేశారు.

■ **సంకష్ట గణపతి కల్యాణం**



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో ఉన్న సంకష్ట గణపతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్, డైరెక్టర్లు రాజిరెడ్డి, రాజయ్య, రాజనర్సు, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి తదితరులు పాల్గొన్నారు.

■ **ఆలయానికి వంట పాత్రలు అందజేత**



పిట్లం: మండలంలోని చిన్నకొడప్‌గల్‌లో ఉన్న రామలింగేశ్వర ఆలయంలో అన్నదాన కార్యక్రమాల నిర్వహణ కోసం అదే గ్రామానికి చెందిన వినోద్ కుమార్ వంట పాత్రలు అందజేశారు.

ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



సంబరాల్లో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

కామారెడ్డి టౌన్: ఎన్‌ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం కామారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ మాట్లాడుతూ 1971లో అప్పటి ప్రదాని ఇందిరాగాంధీ నేతృత్వంలో ఎన్‌ఎస్‌యూఐ ఏర్పడిందని, అప్పటి నుంచి విద్యారంగంలో అలుపెరగని పోరాటాలతో ఎన్నో విజయాలు సాధించినట్లు తెలిపారు. అనంతరం స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భరత్, నాయకులు శ్రీధర్, శ్యామ్ సుందర్, సోఫియాన్, గౌతమ్, సన్నీ, దీప్ సాయి, ప్రకాష్, సాయి కిరణ్, ఠాగూర్, సాయి గణేష్ పాల్గొన్నారు.

ఇంటింటా టీడీపీ



ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

లింగంపేట: మండలంలోని ముంబోజిపేట గ్రామంలో ఆదివారం ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం కోఆర్డినేటర్ మహేష్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా వివరించినట్లు తెలిపారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 2 లక్షల విలువ చేసే వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, రాజు, స్వప్న, నారాయణ, లక్ష్మయ్య, శ్రీనివాస్, చందు, అంజయ్య, మహేష్, శ్రీనివాస్, రాజులు, ప్రశాంత్, జనార్దన్‌గౌడ్, కాశీరాం, అంజయ్య, పోచయ్య, రాములు, మహేష్, సంపత్, రవిందర్, గంగాసాగర్, లక్ష్మి, జానకవ్వ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న పాల కేంద్రాల మండల అధ్యక్షుడు

భిక్కనూరు: పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలని పాల కేంద్రాల మండల అధ్యక్షుడు లోహిత్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. పాల దిగుబడిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పాల కేంద్రాల మండల ఉపాధ్యక్షుడు యాదవరెడ్డి, ప్రతినిధులు లక్ష్మన్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం

■ **కుమ్మరి సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక**



కామారెడ్డి అర్బన్: కుమ్మర సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక సాందీపని కళాశాలలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.జయంతిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగెం ఎంపీటీసీ సభ్యుడు కుమ్మరి రాములు, ప్రధాన కార్యదర్శిగా డి.మోహన్, కోశాధికారిగా కె.భాస్కర్, గౌరవ అధ్యక్షుడుగా కె.సత్యం, అసోసియేట్ అధ్యక్షుడిగా దుర్కి ఎంపీటీసీ నారాయణ, ఉపాధ్యక్షులుగా డి.శివకుమార్, రాజన్న, గంగారాం, యాదగిరి, మహేందర్, కార్యదర్శులుగా హన్మాండ్లు, గంగాధర్, రాము ఎన్నికయ్యారు.

■ **యాదవ సంఘం..**



భిక్కనూరు: మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా జక్కుల సిద్దరాములు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్, కోశాధికారిగా రవికుమార్ యాదవ్, ఉపాధ్యాక్షుడిగా మల్లేషు యాదవ్, జాయింట్ సెక్రటరీగా లక్ష్మన్‌యాదవ్ ఎన్నికయ్యారు.

■ **జిల్లా డ్యాన్స్, స్పోర్ట్స్..**



కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో ఆదివారం నిర్వహించిన డ్యాన్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా వంశీ ప్రతాప్, అధ్యక్షుడిగా యం.కార్తీక్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా మధుసూధన్‌రెడ్డి, కార్య దర్శిగా రాజు, కోశాధికారిగా బద్రి ఎన్నికయ్యారు.

■ **విశ్వబ్రాహ్మణ అర్చక..**

కామారెడ్డి రూరల్: విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షుడిగా నరేష్ ఆచార్యులు, ప్రధాన కార్యదర్శి రామచంద్రమాచారి, ఉప కార్యదర్శిగా కొత్తపల్లి రాజాచార్యులు, కోశాధికారిగా అల్వాల శ్రీనివాస్ చారి, ప్రధాన సలహాదారుడిగా నాగభూషణం ఆచార్యులు, మురళి ఆచార్యులు ముఖ్య సలహాదారులు కసాల లింగమాచారి, గడ్డపు రాజేష్ చారిలను ఎన్నుకున్నారు.

■ **పెరిక సంఘం..**

దోమకొండ: పెరిక సంఘం మండల అధ్యక్షుడిగా పూజారి రాజు, ఉపాధ్యక్షుడిగా దేవరగట్టు జనార్దన్, తిప్పని సిద్ధరాములు, ప్రధాన కార్యదర్శిగా కొండ్ల చంద్రశేఖర్, కార్యదర్శిగా గొల్ల ప్రభాకర్, కోశాధికారిగా ఏర్వ వేణుమాధవ్‌లను ఎన్నుకున్నారు.

సంక్షిప్తం

స్నేహితుడి కుటుంబానికి సహాయం
బీబీపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల 1994–95 బ్యాచ్ పదో తరగతి బ్యాచ్‌కు చెందిన వారు తోటి స్నేహితుడికి ఆర్థిక సహాయం అందజేశారు. సతీష్ అనే వ్యక్తి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆర్థిక ఇబ్బందులను గుర్తించి స్నేహితులు రూ. 25 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

అన్నదాన కార్యక్రమాలు
కామారెడ్డి టౌన్: అయ్యప్ప అన్న ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక అయ్యప్ప ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు గందె శ్రీనివాస్, అయ్యప్ప ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి గోనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి
బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రాహింపేట్ గ్రామంలో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని సర్పంచ్ నారాయణరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు.

మాజీ ఎంపీ నరేంద్రకు నివాళి
ఎల్లారెడ్డిరూరల్: బీజేపీకి చెందిన మాజీ ఎంపీ నరేంద్ర వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పది నెలలుగా అందని జీతం
బాన్సువాడ రూరల్: మండలంలోని కాద్లాపూర్‌లో పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న నాగుల్‌రావ్ ధడేకర్, రాజుబాయిలకు 10 నెలలుగా జీతాలు రావడం లేదు. నెలకు ఇవ్వాల్సిన రూ. 3 వేలు కూడా ఇవ్వలేదని, కుటుంబ జీవనం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

తాగు నీటికి ఇబ్బందులు
తాడ్వాయి: మండల కేంద్రంలోని 6వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పరిష్కారం కాలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం
లింగంపేట: రోడ్డు ప్రమాదంలో లింగంపేటకు చెందిన దేవరాజ్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అంత్యక్రియలకు బీఆర్‌ఎస్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సూచన మేరకు బీఆర్‌ఎస్ నాయకులు బొల్లు శ్రీకాంత్, ముదాం సాయిలు ఆర్థిక సహాయం అందజేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు
భిక్కనూరు: మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గాంధీగౌడ్ హెచ్చరించారు. ఆదివారం ఆయన తన సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

12న ఆర్యక్షత్రియ సంఘ భవనానికి శంకుస్థాపన
కామారెడ్డి టౌన్: ఆర్యక్షత్రియ రాష్ట్ర సంఘం భవన నిర్మాణానికి 12న హైదరాబాద్‌లో నిర్వహించనున్న శంకుస్థాపన కార్యక్రమానికి తరలిరావాలని సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. దేవునిపల్లిలోని సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రజనీకాంత్, కృష్ణాజిరావు, నారాయణ రావు, బాలకిషన్, సరేందర్‌రావు, రాజేశ్వర్ పాల్గొన్నారు.